క్లుప్తంగా

21న 'నాకు నచ్చిన గురువు' పుస్తకం ఆవిష్కరణ

వరంగల్ చౌరస్తా: ప్రభుత్వ ఉపాధ్యాయుడు డాక్టర్ మడత భాస్కర్ సంపాదకత్వంలో వెలువడుతున్న 'నాకు నచ్చిన గురువు' పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని ఈనెల 21న నిర్వహించనున్నట్లు రాధాకృష్ణ సాహితీ వేదిక అధ్యక్షుడు చక్రవర్తుల శ్రీనివాస్ ఒక ప్రకటలో తెలిపారు. హనుమకొండ బాలసముద్రంలోని సామ జగన్‌మోహన్ స్మారక భవన్‌లో పుస్తకాన్ని కవి అందెశ్రీ, తదితరులు ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు.

నీలాపతాక అమ్మవారుగా రాజరాజేశ్వరీదేవి



హన్మకొండ కల్చరల్: శాకంబరి ఉత్సవాల్లో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి ఎదురుగా ఉన్న రాజరాజేశ్వరీదేవి దేవాలయంలో నిర్వహిస్తున్న భాగంగా ఆషాఢ శుద్ధ ఏకాదశి బుధవారం అమ్మవారిని నీలాపతాక నిత్యగా అలంకరించి పూజలు చేశారు. ఆలయ అర్చకుడు యెల్లంభట్ల లక్ష్మణశర్మ ఆధ్వర్యంలో అర్చకులు ఉదయం అర్చనలు, లలిత సహస్రనామ పారాయణం చేశారు. అనంతరం మహాహారతి ఇచ్చి భోజన ప్రసాదాల వితరణ చేశారు. ఈ సందర్భంగా అర్చకుడు లక్ష్మణశర్మ మాట్లాడుతూ దక్షిణయానం ప్రారంభమవుతున్నందున ప్రతీ అమావాస్య విశేషమైందని వివరించారు. పూజా కార్యక్రమాలను ఆలయ చైర్మన్ వద్దిరాజు వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.

శ్రీలక్ష్మికి డాక్టరేట్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని మైక్రో బయాలజీ విభాగం పరిశోధకురాలు కె.శ్రీలక్ష్మికి యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. స్క్రీనింగ్ అండ్ డిటెక్షన్ ఆఫ్ మల్టీ డ్రగ్ రెసిస్టెంట్ బ్యాక్టీరియల్ అసోసియేషన్ అండ్ కాంప్లికేషన్స్ ఆన్ క్రానిక్ కిడ్నీ డిసీస్ కంట్రోల్ మేజర్స్ అండ్ ఫ్యూచర్ డైరెక్షన్స్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి శ్రీలక్ష్మికి డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ నర్సింహచారి తెలిపారు. మైక్రోబయాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీనివాస్ ముంజం పర్యవేక్షణలో శ్రీలక్ష్మి తన పీహెచ్‌డీ పూర్తిచేశారు. శ్రీలక్ష్మి ప్రస్తుతం హనుమకొండలోని మైనార్టీ వెల్ఫేర్ జూనియర్ కళాశాలలో అధ్యాపకురాలుగా పనిచేస్తున్నారు.

నేడు బీసీ కులగణన సాధన సభ

హన్మకొండ: రాష్ట్రంలో సమగ్ర కులగణన చేపట్టి రిజర్వేషన్లను బీసీ జనాభా లెక్కల ప్రకారం పెంచే వరకు ఉద్యమాన్ని ఆపే ప్రసక్తే లేదని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ తెలిపారు. గురువారం ఉదయం హనుమకొండ హంటర్ రోడ్డులోని సత్యం కన్వెన్షన్ హాల్‌లో జరగనున్న సమగ్ర కులగణన సాధన యాత్ర సభకు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని బీసీ కులస్తులు పార్టీలకతీతంగా తరలివచ్చి బీసీల ఐక్యతను చాటాలని ఒక ప్రకటనలో కోరారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే సమగ్ర కులగణన చేపట్టి, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతానికి బీసీ రిజర్వేషన్లను పెంచుతామని కామారెడ్డి సభలో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. బీసీ డిక్లరేషన్‌ను ప్రభుత్వానికి గుర్తు చేయడానికి, ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడానికి.. బీసీ డిక్లరేషన్ ప్రకటించిన కామారెడ్డి నుంచే బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ నేతృత్వంలో బీసీ కుల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో సమగ్ర కులగణన సాధన యాత్ర మొదలు పెట్టినట్లు తెలిపారు. ఈనెల 14న కామారెడ్డి నుంచి ప్రారంభమైన యాత్ర ఈనెల 18న హనుమకొండకు చేరుకుందని వేణుగోపాల్ గౌడ్ పేర్కొన్నారు.

పెండింగ్ డీఏలు చెల్లించాలి



విద్యారణ్యపురి: రాష్ట్రంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను చెల్లించాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్‌టీయూటీఎస్) రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి డాక్టర్ ఎ.సదయ్య డిమాండ్‌చేశారు. హనుమకొండలోని ఎస్‌టీయూ భవన్‌లో బుధవారం నిర్వహించిన జిల్లాస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పీఆర్‌సీ నివేదికను తెప్పించుకొని 65శాతం ఫిట్‌మెంట్‌తో వేతన సవరణ చేయాలని సూచించారు. ఎస్‌టీయూ టీఎస్ వరంగల్ జిల్లా బాధ్యుడు నాగరాజు మాట్లాడుతూ పదోన్నతుల్లో రెండు మూడు పదోన్నతులు పొందిన టీచర్లు ఒక పోస్టులో జాయిన్ అయ్యారని, మిగిలిపోయిన పోస్టులకు మళ్లీ పదోన్నతులు కల్పించాలని కోరారు. సమావేశంలో ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అదనపు కార్యదర్శి రూపిరెడ్డి సుధాకర్ రెడ్డి, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కామగోని రాంబాబు, ప్రధాన కార్యదర్శి వేమునూరి రాంబాబు, వరంగల్ జిల్లా అధ్యక్షుడు అల్లోజు కిషన్ మాట్లాడారు. బాధ్యులు విద్యాసాగర్, శ్రీధర్, మేడ కిషన్, కొంపెల్లి రవీందర్ రెడ్డి, రమేష్, గణపతి, తిలక్ పాల్గొన్నారు.

నగరంలో మొహర్రం



కోటలో ఊరేగింపుగా వస్తున్న పీరీలు



మడికొండలో పీరీలను ప్రదర్శిస్తున్న ముస్లింలు



హన్మకొండ అర్బన్: పీరీల ఊరేగింపులో ముస్లింలు

ఖిలా వరంగల్: మొహర్రం ఇస్లాం పోరాటయోధులు హజ్రత్ ఇమామ్ హుస్సేన్, హుస్సేన్ ప్రాణత్యాగానికి గుర్తుగా వారి సేవలను స్మరిస్తూ కులమతాలకు అతీతంగా ప్రతిష్ఠించే పీరీలను త్యాగనిరతికి ప్రతీకగా కొలుస్తుంటారు. మత సామరస్యానికి ప్రతీకగా జరుపుకునే మొహర్రం వేడుకలను ఖిలా వరంగల్ మధ్యకోటలో బుధవారం జరుపుకున్నారు. నెలవంక మొదలుకొని 10రోజుల పాటు వేడుకలను నిర్వహించారు. ఖిలా వరంగల్ మధ్యకోట చావడీల్లోని హజ్రత్ ఇమామ్ హుస్సేన్, హుస్సేన్‌ల ప్రతిరూపంగా భావించే పీరీలకు బుధవారం సాయంత్రం ముస్లిం మతపెద్దలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మొహర్రం సందర్భంగా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

త్యాగానికి చిహ్నం

మడికొండ: మొహర్రంను పురస్కరించుకుని మడికొండలో ముస్లింలు పీరీల వేడుకలను బుధవారం నిర్వహించారు. గ్రామంలోని వీధుల్లో తిరుగుతూ ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా పీరీలను కులమతాలకు అతీతంగా ప్రజలు, 64వ డివిజన్ కార్పొరేటర్ ఆవాల రాధికరెడ్డి దర్శించుకున్నారు. అనంతరం గ్రామంలో ఏకలవ్య కాలనీలోని స్థలంలో పీరీలను ప్రతిష్ఠించారు. ఈ ఉత్సవాల్లో మత పెద్దలు దావుద్, అంజాద్, రహీం, రహీంపాషా, అక్బర్‌పాషా, తదితరులు పాల్గొన్నారు.

త్యాగం, సహనానికి ప్రతీక

హన్మకొండ అర్బన్: త్యాగం, సహనానికి మొహర్రం ప్రతీక అని వడ్డేపల్లి ముజావర్ (పూజారి) మహమ్మద్ యాకూబ్ అన్నారు. వడ్డేపల్లి, ఎన్జీవోస్ కాలనీ, స్నేహనగర్, వడ్డెపల్లి చర్చి జంక్షన్, రాఘవేంద్ర నగర్, తదితర ప్రాంతాల్లో పీరీలతో ముస్లింలు బుధవారం ఊరేగించారు. ఈ సందర్భంగా పీరీలకు ప్రజలు ప్రత్యేక ప్రార్థనలు చేసి కానుకలు, కుడుకలు కట్టి మొక్కుకున్నారు. కార్యక్రమంలో ముస్లిం, మైనార్టీ నాయకులు అఫ్రోజ్, ఆరిఫ్ హుస్సేన్, జమీల్, ఆసిఫ్, అక్రమ్, షఫీ, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి మండల సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

పీరీల ఊరేగింపులో మంత్రి, మేయర్

వరంగల్ చౌరస్తా: వరంగల్ చౌర్‌బౌలిలో పీరీల ఊరేగింపులో రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, నగర మేయర్ గుండు సుధారాణి హాజరయ్యారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

హసన్‌పర్తిలో..

హసన్‌పర్తి: మొహర్రం పర్వదిన వేడుకలను బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం పీరీలను ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు ఎదురేగి మొక్కులు చెల్లించుకున్నారు. హసన్‌పర్తితో పాటు భీమారం, ముచ్చర్ల, వంగపహాడ్, నాగారం, సిద్దాపురం, అర్వపల్లి, మునిపల్లి, పెగడపల్లి, గోపాలపురం, గుండ్లసింగారం, పలువేల్పులల్లో వేడుకలు జరిగాయి.

35వ డివిజన్‌లో..

కాశిబుగ్గ: మత సామరస్యానికి ప్రతీక మొహర్రం అని 35వ డివిజన్ కార్పొరేటర్ సోమిశెట్టి ప్రవీణ్ అన్నారు. డివిజన్‌లోని ఏసీరెడ్డినగర్‌లో అఫ్జల్ ఆధ్వర్యంలో మొహర్రం వేడుకలు నిర్వహించారు. పీరీలను భక్తిశ్రద్ధలతో పూజలు చేసి వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ప్రవీణ్ పాల్గొని పూజలు చేశారు. వేడుకల్లో డివిజన్ నాయకులు, ముస్లింలు పాల్గొన్నారు.



ప్రార్థనలో మంత్రి సురేఖ, మేయర్ సుధారాణి



హసన్‌పర్తిలో పీరీల ప్రదర్శన



కాశిబుగ్గ: ఏసీరెడ్డినగర్‌లో..

కనులపండువగా బీరన్న బోనాలు



ఓసిటీలో బీరన్న బోనాలతో మహిళలు



హసన్‌పర్తి: బోనాలతో ప్రదర్శన

కాశిబుగ్గ: ఆషాఢ మాసం తొలి ఏకాదశిని పురస్కరించుకొని 19వ డివిజన్ కాశిబుగ్గ ఓసిటీలో బీరన్న స్వామి బోనాలను కురుమ కులస్తులు బుధవారం కనులపండువగా జరుపుకున్నారు. రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ, నగర మేయర్ గుండు సుధారాణి బోనం ఎత్తి బీరన్నకు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఓసిటీ, కాశిబుగ్గ తదితర ప్రాంతాల నుంచి మహిళలు తలపై బోనం ఎత్తుకుని డప్పుచప్పుళ్ల మధ్య బీరన్న దేవాలయం వద్దకు చేరుకుని బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. అనంతరం పోతరాజుకు గొర్రె పోతులను బలిచ్చారు. కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాం రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, చాంబర్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ ఓని భాస్కర్, మీసాల ప్రకాష్, కూచన రవీందర్, దాసరి రాజేష్, తదితరులు బీరన్న దర్శించుకుని పూజలు చేశారు.

హసన్‌పర్తిలో..

హసన్‌పర్తి: తొలి ఏకాదశిని పురస్కరించుకుని హసన్‌పర్తి మండల కేంద్రంలో బీరన్న బోనాలను బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం స్వామివారికి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు పావుశెట్టి శ్రీధర్, గొల్ల కురుమ సంఘం పెద్దలు కోరె కుమారస్వామి, కాలె యాదగిరి, అట్ల కర్ణాకర్, సాంబయ్య, దాడి రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణదారులపై చర్య తీసుకోవాలి

ఖిలా వరంగల్: చెరువులు, కుంటలను ఆక్రమిస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని సీసీఐ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలిచెర్ల సుదర్శన్ డిమాండ్ చేశారు. చెరువులు, కుంటలు కబ్జాకు గురికావడం వల్లనే పలు కాలనీలు వరద ముంపునకు గురవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. హైకోర్టు సీనియర్ న్యాయవాది మురారిశెట్టి యశ్వంత్‌కుమార్, వరంగల్ బార్ అసోసియేషన్ మాజీ వైస్ చైర్మన్ రంగరాజు ఆనందరావు, ఏబీసీ డబ్ల్యూసీ అధ్యక్షుడు త్రిపురోజు రవికుమార్ అధ్యక్షతన తెలంగాణ రాష్ట్ర వినియోగదారుల సమాఖ్య న్యాయ సలహా కమిటీ సమావేశం వరంగల్ శివనగర్‌లోని సమాఖ్య జిల్లా కార్యాలయంలో బుధవారం జరిగింది. ముఖ్యఅతిథిగా సుదర్శన్ మాట్లాడుతూ దేశాయిపేట చిన్నవడ్డెపల్లి చెరువు 300 సర్వే నంబర్, తిమ్మాపురం బెస్తం చెరువు 241సర్వే నంబర్, మట్టివాడ కోట చెరువు 352 సర్వే నంబర్లతోపాటు రామ సముద్రం, గొర్రెకుంటలోని కట్టమల్లన్న చెరువు, శాకరాశికుంట, భద్రకాళి చెరువుల్లోని భూములన్నీ ఆక్రమణలకు గురయ్యాయని వివరించారు. సమావేశంలో న్యాయవాదులు రాయబారపు భిక్షపతి, బండి అనిల్‌కుమార్, మండలి అధ్యక్షుడు మురహరి కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సుదర్శన్

ఘనంగా ఏకలవ్య జయంతి

వరంగల్: తొలి ఏకాదశి సందర్భంగా నిర్వహించే ఎరుకల ఆరాధ్యుడు ఏకలవ్య జయంతి వేడుకలను కాశిబుగ్గలోని యువజన సంఘం భవనంలో బుధవారం నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ స్వర్ణలత ముఖ్యఅతిథిగా పాల్గొని ఏకలవ్య చిత్రపటానికి పూలమాల వేశారు. కార్యక్రమంలో ఓని భాస్కర్, తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేతిరి రాజశేఖర్, నాయకులు పల్లకొండ ప్రభాకర్, పల్లకొండ హరి, పల్లకొండ యాదగిరి, ఓని సదానందం, పల్లకొండ రాజేందర్, మహిళా సంఘ సభ్యులు మానుపాటి సబిత, మాదగాని సరోజన, ఓని రజిత, పల్లకొండ కల్పన, పల్లకొండ సమ్మక్క తదితరులు పాల్గొన్నారు.



ఏకలవ్య జయంతి వేడుకల్లో నాయకులు

ఉపాధ్యాయుల పాత్ర గొప్పది

వరంగల్: సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర గొప్పదని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖా మంత్రి కొండా సురేఖ కొనియాడారు. బుధవారం హనుమకొండలోని రాంనగర్‌లో తన బంధువు, ఉపాధ్యాయురాలు వసంత - సత్యనారాయణ పదవీ విరమణ అభినందన సభ, జన్మదినోత్సవ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వసంత డిగ్రీ చదువుతున్న సమయంలోనే వివాహం చేసుకున్నప్పటికీ, చదువును నిర్లక్ష్యం చేయకుండా పట్టుదలతో ముందుకుసాగి ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా సమాజానికి సేవలందించారని ప్రశంసించారు.

రెడ్డి కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలి



వెంకట్రామిరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

హన్మకొండ అర్బన్: రెడ్డి కార్పొరేషన్ నిధులు కేటాయించి, విధి విధానాలు ఖరారు చేయాలని తెలంగాణ రాష్ట్ర రెడ్డి సంఘం అధ్యక్షుడు గోపు జైపాల్‌రెడ్డి కోరారు. ఈ మేరకు కుడా చైర్మన్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఇనుగాల వెంకట్రామిరెడ్డిని సంఘం నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సంఘం జిల్లా అధ్యక్షుడు అర్జుల కిషన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు రాష్ట్ర ప్రభుత్వాన్ని కృతజ్ఞతలు తెలుపుతూ కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలని కోరారు. సమావేశంలో సంఘం నాయకులు దొంతి తిరుపతిరెడ్డి, సంజీవరెడ్డి, సురేందర్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, హన్మంతరెడ్డి, రాజిరెడ్డి, జైహింద్‌రెడ్డి, గణపతిరెడ్డి, రవీందర్‌రెడ్డి, ప్రకాశ్‌రెడ్డి, జయపాల్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, పీఆర్‌కే రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పంపు ఆపరేటర్ కుటుంబాన్ని ఆదుకోవాలి

దేశాయిపేట: పైడిపల్లి గ్రామలో మున్సిపల్ కార్పొరేషన్ పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తూ అనారోగ్య సమస్యలతో మృతి చెందిన జన్ను పటేల్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ డివిజన్ అధ్యక్షుడు వడ్డేమాన్ కోట తిరుపతి కోరారు. ఈమేరకు జన్ను పటేల్ మృతిపై సంతాపాన్ని వ్యక్తం చేసి బాధిత కుటుంబానికి బుధవారం ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పంపు ఆపరేటర్‌గా జన్ను పటేల్ మూడవ డివిజన్‌లో 20ఏళ్లుగా సేవలందించాడని గుర్తుచేశారు. నాయకులు జన్ను అరుణాకర్, జన్ను రవి, భాస్కర్, రామచంద్ర పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



సఖి సేవలపై అవగాహన కల్పిస్తున్న వినీల

హన్మకొండ అర్బన్: మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సఖి సెంటర్ కేస్ వర్కర్ వినీల సూచించారు. సఖి వన్‌స్టాప్ సెంటర్ ఆధ్వర్యంలో నగరంలోని శ్రీశ్రీ వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌లో మహిళలకు సఖి సేవల గురించి బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వినీల మాట్లాడుతూ సఖి కేంద్రం ముఖ్య ఉద్దేశాలు, అందించే ఐదు రకాల సేవలైన కౌన్సెలింగ్ సహాయం, వైద్య సహాయం, పోలీస్ సహాయం, తాత్కాలిక వసతి, న్యాయ సహాయం గురించి వివరించారు. మహిళలు గృహహింస, లైంగిక వేధింపులు, పనిచేసే చోట వేధింపులు, అత్యాచారాలు నుంచి రక్షణ పొందడానికి సఖి కేంద్రం అండగా ఉంటుందని వివరించారు. బాధిత మహిళలు, బాలికలు 181 టోల్ ఫ్రీ నంబర్, 0870 2452112 నంబర్‌కు కాల్ చేసి తక్షణ సహాయం పొందవచ్చని చెప్పారు. పారామెడికల్ సిబ్బంది ఎస్.కరుణ, హాస్టల్ వార్డెన్ తిరుమల, విద్యార్థినులు పాల్గొన్నారు.

అక్కలమ్మ పండుగ

కాజీపేట రూరల్: తొలి ఏకాదశిని పురస్కరించుకొని కాజీపేట దర్గా పవన్‌నగర్‌లో ప్రజలు అక్కలమ్మ తల్లి పండుగను భక్తిశ్రద్ధలతో బుధవారం జరుపుకున్నారు. బిందలతో నీళ్లు తీసుకెళ్లి తల్లి పాదాలను కడిగారు. ప్రజలందరు సుఖసంతోషాలతో సుభిక్షంగా ఉండాలని, ప్రజలపై తల్లి కరుణకటాక్షం ఉండాలని వేడుకున్నారు. బీజేపీ మాజీ కార్పొరేటర్ నార్లగిరి రామలింగం ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో పవన్‌నగర్ కాలనీ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.



మొక్కులు చెల్లిస్తున్న ప్రజలు

హంటర్‌రోడ్డు వాసులకు నోటీసులివ్వడం సరికాదు

వరంగల్ చౌరస్తా: వరంగల్ హంటర్‌రోడ్డు భద్రకాళి చెరువు సమీపంలో ఏళ్ల తరబడి నివాసముంటున్న గృహవాసులకు నోటీసులు ఇవ్వడం సరికాదని స్థానిక కార్పొరేటర్ గందె కల్పన అన్నారు. హంటర్ రోడ్డులో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ 1998లో భద్రకాళి బండ్ నిర్మించారని, బండ్ అభివృద్ధికి సంబంధించిన సొమ్మును స్థానికుల నుంచే వసూలు చేసినట్లు పేర్కొన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం ఎన్‌టీఆర్‌నగర్ పేరిట ఇళ్ల పట్టాలు పంపిణీ చేయగా, పేదలు ఇళ్లు నిర్మించుకున్నారని వివరించారు. ఇప్పుడు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పేరిట వారికి నోటీసులు జారీ చేయడంపై కార్పొరేటర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. సమావేశంలో గందె నవీన్, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు రామిని సుమన్, నాయకులు కొత్తపెల్లి రాజేష్, లోకేష్, పవన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కార్పొరేటర్ గందె కల్పన

ఆలయాల్లో తొలి ఏకాదశి పూజలు



కాశీ విశ్వేశ్వరాలయ ఆవరణలోని బావి వద్ద పూజలు చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



మెట్టుగుట్టపై ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు



కాశిబుగ్గ రంగనాథస్వామి దేవాలయంలో..

కాశిబుగ్గ: తొలి ఏకాదశిని పురస్కరించుకుని కాశిబుగ్గలోని కాశీ విశ్వేశ్వర, రంగనాథ స్వామి దేవాలయాల్లో ఆలయ కమిటీ సభ్యులు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రంగనాథస్వామి దేవాలయంలో స్వామివారికి పంచామృతాలతో ప్రత్యేక పూజలు చేశారు. అలాగే, కాశీ విశ్వేశ్వరాలయ ఆవరణలోని బావిలో గంగామాతకు పంచామృతాలతో కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. పూజా కార్యక్రమాల్లో ఆయా ఆలయ కమిటీ సభ్యుడు, 20వ డివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేంద్రకుమార్, వంగర రవి, వేముల నాగరాజు, పేరుమాళ్ల లక్ష్మణ్, ఆకెన వెంకటేశ్వర్లు, మార్గం ఎల్లయ్య, మాడేటి అశోక్, ఓరుగంటి కొమురయ్య, వైకుంఠం, అర్చకులు ఆరుట్ల కృష్ణమాచార్యులు, రజినీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మెట్టుగుట్టపై ప్రత్యేక పూజలు

మడికొండ: తొలి ఏకాదశి సందర్భంగా మడికొండలోని మెట్టు రామలింగేశ్వర స్వామి ఆలయంలో అర్చకుడు రాగిచేడు అఖిలాష్‌శర్మ మంత్రోచ్ఛరణల మధ్య బుధవారం ప్రాతఃకాల మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. విశేష అలంకరణ చేసి అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. స్వయంభూ భద్రకాళి అమ్మవారికి పంచామృతాలు, పండ్ల రసాలు, పసుపు, కుంకుమతో వేద మంత్రోచ్ఛరణల మధ్య అభిషేకం, కుంకుమార్చనలు చేసి వివిధ రకాల కూరగాయలు, పుష్పలతో గర్భాలయాన్ని అలంకరించారు. అలాగే, సీతారామచంద్ర స్వామి ఆలయం, శివాలయంలో స్వామి వార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి కే.శేషభారతి, ఆలయ అర్చకులు పరాశరం విష్ణువర్ధనచార్యులు, పారుపల్లి సత్యనారాయణశర్మ, సాయిశర్మ, మణిశర్మ, దేవేందర్ శర్మ, భక్తులు పాల్గొన్నారు.



కాజీపేటలో..

కాజీపేట పట్టణంలో..

కాజీపేట: తొలిఏకాదశి పూజలను కాజీపేట పట్టణంలో భక్తులు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. హిందూ సంప్రదాయంలో ఆషాఢ మాసంలో వచ్చే మొదటి పండుగ కావడంతో పిల్లాపాపలతో గ్రామ దేవతలతో పాటు ఇళ్లలో ఉండే దుర్గమ్మ, ఉప్పలమ్మ, సమ్మక్క - సారక్క, తదితర దేవతామూర్తులను చక్కగా అలంకరించి పూజలు చేశారు. పట్టణంలోని స్వయంభూ శ్వేతార్క మూలగణపతి, అభయాంజనేయ స్వామి, పంచముఖ ఆంజనేయ స్వామి, చైతన్యపురి వెంకటేశ్వర స్వామి ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి.

21న గురుధామంలో గురుపౌర్ణమి



గురుపౌర్ణమి పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ట్రస్టీలు

వరంగల్: ములుగురోడ్డు సమీపంలోని సప్త గురు ధామంలో ఈనెల 21వ తేదీన శివానంద గురు కల్చరల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురుపౌర్ణమి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు మేనేజింగ్ ట్రస్టీ త్రిపురనేని గోపిచంద్ తెలిపారు. గురుధామంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉత్సవాల పోస్టర్లను ట్రస్టీలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 30 ఏళ్లుగా గురుపౌర్ణమి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. మరో ట్రస్టీ బండారు సాయినారాయణ మాట్లాడుతూ గురుపౌర్ణమి రోజున ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు అభిషేకం, హారతి, పుష్పార్చన, పల్లకీ సేవ, గురువందనంలో అఖండ బిల్వార్చన, విభూది, రుద్రాక్షలతో అర్చన నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గందె ఉమాశంకర్, లాయక్ పాల్గొన్నారు.

ఘనంగా వన భోజనాలు



హసన్‌పర్తి: నగరంలోని ఉషోదయ కాలనీ, పోలీస్‌కాలనీ, గోపాలపురం ప్రాంతాలకు చెందిన వారు బుధవారం వనభోజనానికి వెళ్లారు. తొలి ఏకాదశిని పురస్కరించుకుని దేవన్నపేట సమీపంలోని కత్తిగుట్టలో ఆటపాటలతో కాలక్షేపం చేశారు. కార్యక్రమానికి లంబాడీ ఐక్యవేదిక హనుమకొండ జిల్లా అధ్యక్షుడు లావుడియా పల్లవి రాజునాయక్, కాలనీ వాసులు హేమానాయక్, అజ్మీరా రమాదేవి, సింధు పాల్గొన్నారు.

బీవీపీ ఆధ్వర్యంలో బృందగీతాల పోటీలు



న్యూశాయంపేట: భారత వికాస పరిషత్ (బీవీపీ)ఆధ్వర్యంలో ఆగస్టులో బృందగీతాల పోటీలు నిర్వహించనున్నట్లు ఆ శాఖ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సుధీర్‌కుమార్ తెలిపారు. హంటర్‌రోడ్డులోని ఓ ప్రైవేట్ పాఠశాలలో బుధవారం జరిగిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆగస్టు రెండవ వారంలో బీవీపీ తెలంగాణ ప్రాంత ఆదేశానుసారం విద్యార్థులకు జాతీయ బృందగీతాల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయనున్నట్లు వివరించారు. ఆగస్టు చివరి వారంలో భారత్ కో జానో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. సమావేశంలో కార్యదర్శి కార్యదర్శి కే.సత్యనారాయణ, ఉపాధ్యక్షులు చంచల్ అగర్వాల్, గోవిందరాజులు, కన్వీనర్లు కమలా మనోహర్‌రావు, వివేకానంద, రామారావు, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.